# పేకాటలో పేకాడించడం

"ఆ్రవ్ రాజా ఆవ్! రూపాయాడండి, వందలు కొట్టండి, వెయ్యండి! వెయ్యండి! కంపెనీ దివాలా? ఆడినోళ్ళు వేయిలచ్చలు పట్టుకెళ్ళాలి, ఆడండి ఆడండి" అంటూన్నాడు లంబ్డీక లచ్చన్న.

నిజంగా అన్నియిదాలా లంబ్డీకేరా వాడు.

ఓ ముక్కమీద అయిదు రూపాయలెట్టిచూశా—ఆ ముక్క కాదు. పోయింది అయిదు రూపాయలు.

"ఆవ్ బచ్చా ఆవ్ రాజా" అంటున్నాడు మళ్ళీ లంబ్డీకేగాడు! అచ్చంగా కంపెనీవోళ్ళు మాదిరే మాటలు నేర్చాడు!

"ఓసారిపోతే ఎప్పుడూ పోతుందా? ఏంరా అబ్బాయిగారి సుబ్బాయ్?" అని నన్నుచూసి అన్నాడు లంబ్డీకెగాడు.

నాకు రోసం వచ్చింది. మూడుముక్కలూ తీశాను. రావోల్సిన రాణీని ముద్దెట్టుకున్నాను. ఏడుకొండల సామికి ఏమిచ్చినా ఇత్తానని మొక్కన్నాను! అల్‌రైటురా అన్నాను. ముక్కలు కలిపాడు. నా దగ్గిర మిగతా పదిరూపాయల్లో మళ్ళీ అయిదేశాను. ఆడుతున్నది మేం ముగ్గురం. నేనూ లంబ్డీకగాడు ముక్కు తిమ్మాయ్‌గాడు. అవుల్దార్ మేజరెప్పుడొత్తాడో అని ముగ్గురికీ గుబులు గుబులుగానే ఉంది.

ఎందుకంటా వేమో!

అసలు మిలటరీలో డబ్బెట్టి పేకాడకూడదు. అందులో రాత్రిపూట లైట్సాఫ్ అయింతర్వాత మేలుకుండగూడదు.

మా బారక్కులో ఓ మూల రెండు కంబళ్ళడ్డంపెట్టి కొండిలు ఎలిగించి ఆడుతున్నాం. ఇంక మాకు గుబులు గుబులుగా ఉంటుందా ఉండదా?

ఎంచేతంటే!

అవుల్దార్ మేజరు కర్రుచ్చుకుని బోగం కొంపకు పోయేవాడల్లా టీక్‌టాక్‌గా నడుత్తూ రౌండ్లు తిరుగుతున్నప్పుడు కంటపడ్డామా ఇంకేంలేదు. అంటే రౌండ్లు నిజంగా తిరిగితే!

నిజంగా అని ఎందుకంటారేమో !

ఆడికి ముండ ఉంది. రౌండ్లకని బయల్దేరి ఆడికి సేరుతాడు.

నా డొక్కలో సక్కలిగిల్లెట్టినట్టు ఏలెట్టి "ఏందిరా ఆలోచిత్తున్నావ్, ముక్క తీయీ" అన్నాడు లంబ్డీకెగాడు.

వొణుకుతున్న చేత్తో ముక్క తీశాను. ముచ్చమటలు పోశాయి. ముద్దెట్టుకున్న రాణిముండ రాలేదు. ఏడుకొండలాడికి ఏసిన ముడుపు

కాంసెలు చేశాను. "ఆల్‌రైటు బచ్చా! అదృష్టం బచ్చా! ఆఖరాట ఆఖరాట! ఏమో అదృష్టం ఉంటే ఇందులో రావచ్చు మీకు" అన్నాడు లంబ్డీకెగాడు.

"నీ గుండెలో లంబ్డీకె లంబ్డీకె అంటం మానిందా ఏంటిరా" అన్నాడు ముక్కుతిమ్మాయి.

"టామీగన్ పట్టుకుంటే గుండెల్లో టకటకా టకటకా అని అప్పుడంటుందిరా" అన్నాను నేను.

"ఏడిశావ్రా. డబ్బుపోయిందని ఇశారంగా ఉందేమో మీకు. ఆఖరాట. నా దగ్గిరున్న దాంలో సగమంతా పెడతాను. మీ దగ్గర కాత్తో కూత్తో ఎంతుంటే అంతెట్టండి. పెద్దచాన్స్ ఇత్తున్నా. ఏమంటావురా అబ్బాయిగారి సుబ్బాయి" అన్నాడు లంబ్డీకె.

ఆఖరి అయిదూ ఏద్దాం అనుకున్నా. ముక్కలు కలిపాడు. టకామని ఆడాను. టకామని ముక్కమీద గుద్ది తీశాను. టకామని డబ్బంతా పోయింది.

ఏదో ఓ కంటద్వని ఇనిపించిందిట్లా- "ఏడవ్వాకురా సుబ్బాయి. నువ్వూ తిమ్మాయి ఇద్దరున్నారు గందా! ఆడొక్కడూ మీడబ్బు పట్టుకెళ్ళగలడంట్రా?"

ఎవరో మనోడే అంటున్నాడనుకున్నా.

"నిజమేరా. నాయంగా ఆడేవా అన్నాయంగా ఆడేవా" అన్నాను నేను.

"మాటలు జాగర్తగా రానీ, టామీగన్ నాకు చేతగాకపోయినా కుత్తిపట్లు శాతవును, తెలియదంట్రా?" అన్నాడు లంబ్డీకె. నిజమే!

"ఎంత మొనగాడైనా మీరిద్దరున్నారు గాదంట్రా" అన్నాడు ఆ కంటద్వని.

ఈ తూరి ఆ అన్నోడు మనోడు కాదనుకున్నా.

"యదవా ఆడిమాట యీడిమాట అట్టా ఉంచి ముందు నిన్నెవరు రమ్మన్నార్రా? ఆచ్చర్యం ఏముందీ? నీలాంటి చకునపిట్ట యనకనుంచి చూత్తుంటే అదృట్టం ఎట్టా పడుతుందీ? ఇట్రా-రా తాట ఊడగొడతాను. పేకాడిస్తాను" అన్నాను.

"నీకు గుండె దైర్నం ఉందిరా! తాటూడకొడతావూ? పేకాడిస్తావూ, ఆడదాం పట్టు" అని ఆ కంటద్వనిగాడు ముందుకొచ్చాడు.

ఎక్కడి డబ్బక్కడే వొదిలెట్టారు. ఎక్కడి ముక్క లక్కడే. ఆళ్ళిద్దరూ లేచి టెంషంలో నుంచున్నారు.

ఏందిరా అని ఎనక్కి సూశా. అవుల్దార్ మేజరు. గంతేసి నుంచున్నా. దూలం దెబ్బతాకింది. టెంషం ఇడవలా!

"ఆడండ్రా ఆడండి. నేనున్నానని అనుకోవోకండి" అన్నాడు అవుల్దార్ మేజరు బెత్తం ఆడిత్తూ.

ముగ్గురం ముక్కాపిదైనా ఇడవకుండా అలాగే నుంచున్నాం.

"ఓహో! గార్డు రూములో పడేత్తా ననుకున్నారా? పర్వాలేదు. మీ బోంట్లు ఆడుతుంటే ఎప్పుడైనా నేనూ కలుపుతూంటాను. నా చెయ్యి కూడా" అంటూ మూల బెత్తం ఆనించాడు.

అప్పటికీ కదల్లేదు మేము.

"ముక్కలు కలపరా లంబ్డీకా" అని ఆడర్ సేసినట్టు సూశాడు మేజరు.

డూడూ బసవన్నల్లె కూకున్నాడు లంబ్డీకె. తోక ముడుచుకున్న కుక్కల్లె కూలబడ్డాడు తిమ్మాయి. గిర్రున కిందడ్డ పిట్టల్లె సతికిలడ్డాను నేను.

"సరేగాని మీ కాండిల్ లైట్లు కిటికీలోంచి కనబడుతున్నై. ఓ బ్లాంకెట్టు అడ్డంకట్టరా సుబ్బిగా" అన్నాడు మేజరు. నేనన్న మాటలు మరిశాడనుకున్నా. గబగబా కట్టాను.

"ఇంక పర్వాలేదు. ముక్కలు కలపరా. అయితే నాకి ఆట బాగా తెలీదుసుమా" అన్నాడు మేజరు.

ముక్కలు కలిపాం. మొదటాట మేజరే ఓడాడు. డబ్బిచ్చాడు. మా క్కొంచెం ధైర్నం వొచ్చింది.

రెండో ఆట మూడో ఆట మేజరే గెల్చాడు. మా గుండెలు మోకాళ్ళదాకా జారినై.

"అదుర్టం ఉంటే ఆఖరాట. ఆవ్ బచ్చా ఆవ్ రాజా! రూపాయి లాడాలి. వొందలు కొట్టాలి. ఎయ్యండ్రా" అన్నాడు అవుల్దార్ మేజరు. ఏం సోగ్గా అన్నాడు. కంటంలో కేకుఉన్నట్టే! కంపినోడు గింపినోడు పనికిరాడు. అప్పుడనుకున్నా, మూడు ముక్కలాటలో అవుల్దారు మేజరుకు తెలిందుంటే అవుల్దారు మేజరు అవుతాడా!

"ఎయండ్రా నా దగ్గిరున్నదంతా ఏత్తున్నా. మీ దగ్గిర కాత్తోకూత్తో మీరెయ్యండి" అన్నాడు మేజరు.

వొణుకుతూ గుడ్లురిమి చూత్తూ గొంతు కూకుంటూ టకామని ఆడాడు లంబ్డికె గాడు. టకామని పోయింది ఆఖరి డబ్బంతా.

"ఇహ సాల్రా, లేవండి. లైట్సాఫ్ అయి మూడు గంటలయింది. కిక్కురు మన్నారా రెండు చార్జీలమీద బంద్ సేత్తాను – పేకాడినందుకూ, మేలుకున్నందుకూ" అన్నాడు అవుల్దారు మేజరు డబ్బంతా జేబులో ఏసు కుంటూ. నల్ల మొగా లేసుకుని ఎనక్కు తిరక్కుండా పోతున్నాం.

"నువ్వుండరా సుబ్బాయి. తాట ఊడించుకుంటాను, పేకాడించు కుంటా" నన్నాడు. పైపానం పైనపోయి నిల్చున్నా. తానుపామంటోడు, నేనన్న మాటలు మరవలేదు. గార్డు రూముకు తీసుకెళ్ళాడు. తాటూడ గొట్టాడు. పేకాడించాడు.